*****************************************************************

# ఏ దివిలో విరిసిన పారిజాతమో!!

(On the occasion of S. Janaki' s birthday - April 23d)

*****************************************************************

**"ఏ దివి లో విరిసిన పారిజాతమో"** అనగానే ముందు స్ఫురించేది బాలు అయినా, అదే పాటకు తన గొంతుతో కూడా న్యాయం చేకూర్చిన జానకమ్మకి దాన్ని ఆపాదించటం సమంజసంగానే ఉంటుందనే నమ్మకంతో ఆ టైటిల్ పెట్టి, ఆవిడ మీద నాకున్న అభిమానాన్ని మీతో పంచుకోవటం కోసం నా ఈ చిన్ని ప్రయత్నం.

**"సంగీతమపి సాహిత్యము సరస్వతీ స్తనద్వయం**
**ఏకం ఆపాత మధురం, అన్యదాలోచనామృతము"**

చక్కని గాత్రము కోసము ఏ పూల పూజించి, ఏ లీల సేవించి, ఏ నివేదనలు అర్పించిందో కాని, ఆ గీర్వాణి తన ప్రసాదాన్ని జానకమ్మకి సమతుల్యంగా ప్రసాదించింది. ఆపై ఆమె గళమునే తన రత్నసింహాసనంగా, సుస్థిర స్థానంగా చేసుకుంది. **"పగలు రేయిగా పండు వెన్నెలగా"** మార్చగల సమ్మోహనం, **"కదలే ఊహలకే కన్నులుంటే"** ఎలా ఉంటుందో చిత్రించగల మాధుర్యము, **"కమండలంలో ఇమడలేని గంగ వెల్లువ"** లాంటి ఉత్సాహం కలగలిపిన సుమధుర గాయనీమణి జానకమ్మ.

1938 ఏప్రిల్ 23న రేపల్లెలో పుట్టిన ఈ స్వరబాల తన మూడవ ఏటనే పాటకచేరీలు ఇవ్వడం ప్రారంభించింది. నాదస్వర విద్వాంసులైన శ్రీ పైడిస్వామి వారి వద్ద సంగీత శిక్షణ కూడా పొందింది.

**"నీ ఆశ అడియాశ చేజారే మణిపూస"** అంటూ 1957లో పెండ్యాలగారి దర్శకత్వంలో తొలిసారిగా తెలుగులో తన గళం వినిపించినా, శ్రోతలకి ఆవిడని దగ్గరకు చేర్చి, పేరు ప్రఖ్యాతులను సంపాదించిపెట్టిన పాట **"నీ లీల పాడెద దేవా" (మురిపించే మువ్వలు, 1962).**

"నీ లీల పాడెద దేవా" పాట కోసం ఎస్.ఎం.సుబ్బయ్య నాయుడుగారు ఒక సన్నాయిలాంటి గళం కోసం వెతుకుతుండగా, జానకమ్మ మావగారైన డా.చంద్రశేఖర్ గారి ద్వారా ఆవిడ గురించి విని, ఈ పాటను ఆమెకు ఇవ్వటం జరిగింది. ఆ పాట విని సి.నారాయణరెడ్డి గారు "అమ్మాయి!! నీ గొంతు సన్నాయి" అని వర్ణించారట. పాటల ప్రపంచంలో ఒక సుస్థిర స్థానాన్ని ఏర్పరచుకొని, అభేరీ రాగానికే 'ఆభరణం' అయ్యి, నాటి నుండి నేటి వరకు సంగీతాభిమానులను డోలలాడిస్తూనే ఉంది ఈ పాట.

కరైకూచి అరుణాచలం గారి నాదస్వరం తోటే కాక, బిస్మిల్లాఖాన్ గారి షెహనాయి తోను, ఎం.ఎస్. గోపాల కృష్ణన్ గారి వాయులీనము తోను, హరి ప్రసాద్ చౌరాసియా గారి వేణువు తోనూ పోటీ పడుతూ ఆమె తన సంగీత ప్రస్థానంలో ఎన్నో పాటలు పాడారు.

1970–80 ప్రాంతములో సినీ గీతాభిమానులు, సంగీత దర్శకులు పాటలలో కొత్తదనాన్ని ఆహ్వానించనారంభించారు. గాత్రముతో, వాయిద్యాలతో ప్రయోగాలు చేసి శ్రోతలను మెప్పించడానికి, కొత్తదనాన్ని సృష్టించడానికి సంగీత దర్శకులు మక్కువ చూపించే వారు. ఆ సమయంలో వచ్చిన పాటలు చాలా మటుకు జానకమ్మ గాత్రానికి నప్పేవి కావడం, ఎటువంటి ప్రయోగాలకైనా ఆవిడ గళం సరిపోవడంతో ఎక్కువ పాటలు ఆవిడనే వరించాయి.

ఒకానొక సమయంలో కేవలం శృంగార గీతాలకే పరిమితం అనుకుని ముద్ర వేసిన జానకమ్మ గాత్రమే..

**"వినరా సూరమ్మ కూతురి మొగుడా విషయము చెపుతాను",**

**"సతియే గులపా లచ్చిమిలే....“** అంటూ హాస్యాన్ని..

**"నాలో ఉన్న మనసు నాకు గాక ఇంకెవరికి తెలుసు" (కళ్ళలో ఉన్నదేదో కన్నులకే తెలుసు ),**

**"మేఘుమా దేహమా మెరవకే ఈ క్షణం",**

**"నాకు లేదు మమకారం మనసుపైన అధికారం.." (వెన్నెల్లో గోదారి అందం),**

అంటూ ఆర్ద్రతను కూడా అంతే అద్భుతంగా పలికించిందంటే ఒప్పుకోని వారుంటారా??

అంతేనా!!

"బుగ్గలకావిరి తగిలేలా సిగ్గులు విరిసేనా" అంటూ సిగ్గులొలికే శృంగారమైనా,

"విభునికి నా మనవి వినిపించవమ్మా" అంటూ హృద్యమైన వేడుకోలు అయినా,

"తుళ్ళి తుళ్ళి గంతులు వేసే లేడికేది కట్టుబాటు" అంటూ అదుపులేని ఆనందమైనా,

"సన్న జాజి పడక, మంచెకాడ పడక, మాట వినకుంది ఎందుకే?" అంటూ అల్లరి చేసే అమాయకత్వమైనా,

"మామయ్య వస్తాడంట.. మనసిచ్చి పోతాడంట" అంటూ పడుచు ఆత్రమైనా,

"సెప్టెంబర్ మాసం.. సెప్టెంబర్ మాసం.. పాత బాధలు తలెత్తనివ్వం" అంటూ కుర్రకారు జోరునైనా,

తన గొంతులో అద్భుతంగా పలికించి ఆ పాటలకి అమరత్వం సిద్ధించి పెట్టింది జానకమ్మ.

పాట పాడేటప్పుడు పాటలోని భావాలని తమ శరీరభాషలో చూపించటం ప్రతి గాయకుడికి, గాయనీమణికి సహజ లక్షణమైనా, అందుకు విరుద్ధంగా, ఉలుకు పలుకు లేకుండా, మనిషి ఏ మాత్రము కదలకుండా, చీర కొంగును వేలితో ముడివేస్తూ, ఏ పాటకు ఎలాంటి భావము ఎంత వరకు కావాలో అందించగల నేర్పరి జానకమ్మ మాత్రమే. అసలు అంత కదలకుండా పాడుతూ అన్ని భావాలను ఎలా గుప్పించగలదా అన్నది మన బాలు గారికి ఎప్పటికీ ఆశ్చర్యం కలిగించే విషయమట.

అన్ని భావాలను తన పాటల్లో అందంగా పలికించటం ఒక ఎత్తైతే, తనకు మాత్రమే ప్రత్యేకమైన నవ్వుతో నవరసాలను పండించటం మరో ఎత్తు. చిన్న నవ్వుతో కోటి భావాలు ప్రకటించగల జాణతనం ఆమెకే సొంతం. కాదంటారా??

"నవ్వుతో ముసి నవ్వుతో" లో విరిసిన పువ్వులా..

''పక్కన నువ్వుంటే ప్రతి రాత్రి పున్నమిరా'' లో పాల వెన్నెల రేయిలా..

''సిరి మల్లే పువ్వల్లే నవ్వు'' లో సెలయేటి తరగలలా..

''నవ్వింది మల్లె చెండు'' లో ఉరకలేస్తున్న గోదారిలా ..

''రాగమో అనురాగమో'' లో కొండను ఢీ కొట్టే కెరటంలా..

''శివ శివ అనలేలరా'' లో కోరికలను తట్టి లేపేలా ...

''పరువమా చిలిపి పరుగు తీయకు'' లో తొలకరి జల్లులా...

''ఈ పగలు రేయిగా పండు వెన్నెలగ మారినదేమి చెలి'' లో మంచులో తడిసిన అరవిందంలా..

''పంటచేలో పాలకంకి నవ్వింది'' లో పంట చేల పైర గాలిలా..

''పూవులు పూయును పదివేలు'' లో కుప్పించిన జాణతనంలా..

''సిగ్గు పూబంతి ఇసిరే సీతామాలచ్చి'' లో సిగ్గులొలికే సీతమ్మలా..

ఇలా చెప్పుకుంటూ పోతే వర్ణించటానికి మాటలు వెతుక్కోవాలేమో!!

జానకమ్మ కేవలం పాడటమే కాక సందర్భాన్ని బట్టి గొంతు మార్చి మంచి మిమిక్రి కూడా చెయ్యగలదు. ''గోవుల్లు తెల్లన, గోపయ్య నల్లన'' (సప్తపది), ''అలకపానుపు ఎక్కనేల చిలిపి గోరింక'' (శ్రీవారి శోభనం), ''చిన్నారి పొన్నారి కిట్టయ్య నిన్నెవరు కొట్టారయ్య'' (స్వాతి ముత్యం), ''గున్నమామిడి కొమ్మ మీద'' (బాలమిత్రుల కథ ) పాటలలో ఐదేళ్ల చిన్న పిల్లలానూ, అరవై ఏళ్ల ముసలామెలానూ పాడి మెప్పించింది.పాటలు పాడడమే కాదు, వాటికి సంగీతాన్ని కూడా అందించగలను అని ''మౌనపోరాటం'' సినిమా ద్వారా తన ప్రతిభను చాటి చెప్పింది. అలాగే కొద్దిమందికే తెలిసిన విషయమేమిటంటే... ఆమె మంచి చిత్రకారిణి కూడా!!

1956లో ఆల్ ఇండియా రేడియో వారు నిర్వహించిన పాటల పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి, ఆనాటి రాష్ట్రపతి డా.బాబు రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నది మొదలు, ఎన్నో అవార్డులు, రివార్డులు ఆమె తన కీర్తికిరీటానికి కలికి తురాళ్ళుగా చేర్చుకుంది. జానకిని తొలి "జాతీయ అవార్డు" 1976లో "సెంధూర పూవే" (తెలుగులో పదహారేళ్ళ వయసులో "సిరిమల్లె పువ్వా") పాటతో వరించింది.తెలుగులో ఆ గౌరవాన్ని దక్కించిన పాట "సితార" (1984) సినిమాలోని "వెన్నెల్లో గోదారి అందం". 1980లో ఒక మలయాళం పాటకి, 1992లో మరో తమిళ పాటకి కలిపి, మొత్తం నాలుగు సార్లు ఆమె నేషనల్ అవార్డు అందుకుంది.

జానకమ్మ గురించి ఎంత చెప్పినా తక్కువే కానీ, కొండంత దేవుడికి కొండంత పత్రిని సమర్పించలేము కదా? వేటకు వెళ్ళిన జాలరికి, అదృష్టాన్ని బట్టి ఆణిముత్యాలు, రత్నాలు దొరికినట్టు, ప్రస్తుతం ఎస్.జానకి అనే సంగీత సాగరంలో నాకు దొరికినవి ఇవే. ఇంకా ఇంకా ఎన్నో పాటల గురించి చెప్పాలని ఉన్నా, ఎక్కడో ఒక చోట ముగించాలి కాబట్టి, ఆవిడ ప్రత్యేకత అయిన రొమాంటిక్ సాంగ్స్ కొన్నింటిని తలుచుకుంటూ ముగిస్తున్నాను.

"ఊపిరి తగిలిన వేళ.. నే ఒంపులు తిరిగిన వేళ" (వీణ వేణు వైన సరిగమ విన్నావా?),

"పులుపెక్కే పోకళ్ళు, కైపెక్కే ఆ కళ్ళు, లేలేత కొబ్బరి నీళ్ళు" (అబ్బో నేరేడు పళ్ళు),

"సంధ్యారాగం చంద్రహారతి పడుతున్న వేళ.. మసక చీకటి మధ్యమావతి పాడుతున్న వేళ" (తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు),

"టిక్ టిక్ టిక్ గడియారం పన్నెండయ్యింది",

"వద్దంటే వినడే.. పోకిరి",

"ఆడదాని ఓరచూపుకే జగాన ఓడిపోని ధీరుడెవ్వడు",

"సుమమే విరిసె వెన్నెలమ్మ వాకిట" (మౌనమేలనోయి ఈ మరపురాని రేయి),

“పట్టి తెచ్చానులే పండు వెన్నెలను నేనే“

**"తెల్లారబోతుంటే నా కల్లోకి వస్తాడే" (సిరిమల్లె పువ్వా),**

**"శిరసుపై నే గంగనై మరుల జలకాలాడని" (మనసు పలికే మౌన గీతం)**

ఎన్నో!! మరెన్నో!!

తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, బెంగాలీ, ఒరియ, హింది, సింహళ, జపనీస్ భాషలలో ముప్పై వేలకు పైగా పాటలు పాడిన జానకమ్మ గళానికి అప్పుడే 70 ఏళ్ళంటే నమ్మశక్యం కాకపోయినా.. మరిన్ని కాలాలు ఆవిడ తన గాత్రజాలాన్ని మనపై చల్లుతూ ఉండాలని కోరుకుంటూ.. ఈ పుట్టిన రోజు (ఏప్రిల్ 23) సందర్భంగా అభిమానులందరి తరపున శుభాకాంక్షలు అందిస్తూ..

**"సిరిమల్లె పువ్వల్లె నవ్వు**
**చిన్నారి పాపల్లె నవ్వు**
**చిరకాలముండాలి నీ నవ్వు**
**చిగురిస్తు ఉండాలి మా నువ్వు.. మా నువ్వు"!!**

-- రాగ

ఏప్రిల్ 23, 2009

రచయిత్రి గురించి:

--------------------------------------------------------------------------------

"రాగ" గారు చిమటమ్యూజిక్, శోభన్ బాబు డిస్కషన్ బోర్డులలో గత సంవత్సరం నుండి చాలా చురుకుగా పాల్గొంటున్నారు.

--------------------------------------------------------------------------------

**Acknowledgements: Special thanks to Budugu for formatting this article.**